# దొంగ



వెలుతురును తరుముకొంటూ చీకటి వస్తున్నది. ఇళ్ళల్లోనూ, ఆఫీసులలోనూ దీపాలు వెలిగిస్తున్నారు. బాగా చీకటి పడడానికి ముందుగా ఆకాశమంతా దట్టమైన నల్లని మబ్బు కమ్మి చీకటి తోపింపజేసింది. సన్నని తుంపర కూడా ఆరంభమైంది.

పద్మనాభం ఆఫీసులోనుంచి ఇవతలకు వచ్చాడు. తోలుసంచీ భుజాన వేలాడ వేసుకున్నాడు. ఆఫీసుదగ్గరనుంచి కొన్ని గజాలు నడిచినతర్వాత ఒక కిళ్ళీకొట్టు దగ్గర ఆగాడు. కిళ్ళీకొట్టు ఆసామీ బిగ్గరగా ఏదో డిటెక్టివ్ నవల చదువుతున్నాడు.

“అయ్యగారూ, మీరీ వేళ ఆలస్యంగా వచ్చారు” అన్నాడు ఒక సిగరెట్ పాకెట్టు విప్పుతూ. ఆ పలకరింపులో ప్రశ్నార్థకం కూడా ఉంది. పద్మనాభం ‘ఆలస్యం అయింది’ అన్నట్టు బుర్ర తటాయించాడు.

సిగరెట్టు అందిస్తూ, “మీకు ఒంట్లో బాగులేదా?” అన్నాడు కొట్టతను.

“అబ్బే, లేదు. ఏం?”

“మీరు వణుకుతున్నారు” అన్నాడు కిళ్ళీ కొట్టువాడు. పద్మనాభం గతుక్కుమన్నాడు.

“అహఁ!” అన్నాడు తనను తనే నమ్మలేనట్టు. “ఈవేళ చలిగా ఉంది.” పద్మనాభం గొంతు నీరసంగా, సంశయాత్మకంగా ఉంది.

“ఈ గాలి బాగులేదు. గొడుగు తేలేదా?”

“వర్షం వస్తుందని అనుకోలేదు” అంటూ పద్మనాభం సిగరెట్టు ముట్టించాడు. కిళ్ళీ కొట్లో ఉన్న పెద్ద అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు పద్మనాభం. తన ముఖంకేసి తనే పరీక్షగా చూసుకున్నాడు. నిజంగా తను వణుకుతున్నాడా? అలల అలలుగా కనబడే చవకరకం కిళ్ళీకొట్టు అద్దంలో తన ముఖం ఉబ్బినట్టు, గుండ్రంగా ఉన్నట్టు ఉంది. కళ్ళు మాత్రం పెద్దవిగానూ, నిశితంగానూ ఉన్నాయి. చేతివేళ్ళను ఒకసారి తలలోకి దువ్వినట్టు పోనిచ్చి, కిళ్ళీ కొట్టువాడికి డబ్బులిచ్చి కదిలాడు ఇంటివైపు.

చినుకులు పడడం ఆగిపోయింది. పద్మనాభం గబగబా అడుగులువేస్తూ నడుస్తున్నాడు. అతని అడుగుల చప్పుడు అతనికే బిగ్గరగా, అసహజంగా అనిపించింది. ఏదో చిరాకు అతన్ని ఆవహించింది. వెంట తరుముతున్నది. విద్యుద్దీపాల కాంతి, గాసు లైట్ల కాంతి పచ్చగా, మసకగా అతనికి కనిపిస్తున్నది. అక్కడక్కడ నిలిచిపోయిన వర్షపు నీరు మసకబట్టిన అద్దంలా ప్రతిఫలిస్తున్నది. పద్మనాభం కాలు ఎత్తి ఎత్తి, బురద నీటిలోనే వేశాడు. జోళ్ళు తడిసి బరువెక్కాయి. అడుగులు తడబడుతున్నాయి. మరో సమయంలో అయితే జోళ్ళు అక్కడే పారేసి ఇంటికి నడిచి పోను. తడి జోళ్ళంటే అతనికి అంత అసహ్యం! కాని ఈవాళ అతని మనస్సు ఏదోలా ఉంది. ఏదో ఒకలా ఇంటికి చేరుకోవాలనే తాపత్రయం తప్ప ఇంకేమీలేదు.

అతను నడిచి మెర్క్యురీలైట్ల కాంతిలో

బెదిరించి చేయించలేనిది బ్రతిమాలి సాధించవచ్చు. ద్వేషంతో కానిది ప్రేమతో సాధ్యం. ప్రేమించినవారికోసం ఎంతయినా, ఏమైనా చేయడానికి మనిషి సిద్ధం; పరిణామాలనూ లెక్కచేయడు. కాని తనవారే అందుకు తనను గర్హిస్తే మాత్రం తట్టుకొనలేడు. ఈ ప్రతిబంధకం గొప్పదని తెలుసుకొనడం ఎలాగు?

# దొంగ

వచ్చాడు. నాలుగు రోడ్ల కూడలిలోకి వచ్చాడు. షాపుల్లో ఉన్న దీపాలు చాలా కాంతిమంతంగా ఉన్నాయి. అక్షరాకారంలో ఉన్న నియాన్ దీపాలు వెలుగును ప్రసరిస్తున్నాయి. పేవ్‌మెంట్లమీద జనం రద్దీ ఎక్కువైంది. పద్మనాభానికి కొంత చికాకు తగ్గింది. అతనికి జన సందోహమంటే ఇష్టం. తనను ఎవరూ పట్టించుకోరు. అసలు అతనిని ఎరిగి ఉన్నవారే బహు కొద్ది. అయినా అవతలివాళ్ళ చూపులు అతనిమీద పడితే, తన చూపు, వారి చూపు కలిస్తే అదేమిటో వళ్ళంతామీద ఏదో పాకినట్లు, తనను ఎవరో వెతుకుతున్నట్లు అతనికి అనిపించేది. కళ్ళు దించేసుకుని నడుస్తున్నాడు. అయినప్పటికీ ప్రజలు తనను పరీక్షగా చూస్తున్నట్లు, తనకోసమే చూస్తున్నట్లు అతనికి అనిపించేది. ప్రజలంటే తాను కుదించుకుపోతున్నట్లు, వాళ్ళవైపు చూడడానికి సాహసించలేకపోతున్నాడని వారు భావించినట్లు పద్మనాభానికి అనిపించింది. 'అతనేం చేశాడో తెలుసా?' అని ప్రజలు తనవైపు వేలు పెట్టి చూపించినట్లయింది. 'చూడు, అతనే షరాబు. బాంకులో డబ్బు దోచి పారిపోతున్నాడు. అతనే దొంగ!'

పద్మనాభం గొంతుకలో ఏదో అడ్డుపడినట్లు అతనికి తోచింది. గుండె పక్కటెముకలను అదే పనిగా గుద్దుతున్నది. పోరు చేస్తున్నది. అతను భయం భయంగా, రహస్యంగా తన చుట్టూ చూశాడు. కాని ఎవరూ తనను చూడడంలేదు. అదంతా తన భ్రమే. చిన్న చిరునవ్వు బలహీనంగా అతని పెదవులమీదికి వచ్చింది.

దొంగ!

ఈ మాట అతని వెన్నెముకలోనుంచి జలదరించినట్లయింది. ఆ మాట అతనికి సంభ్రమాశ్చర్యాలను కలగజేస్తున్నది. అవును. అతను దొంగ. అతను డబ్బు దొంగిలించాడు. కాని అలా తలుచుకుంటూ ఉంటే అతనికి సిగ్గు, లజ్జ, నేరం చేశాననే భావన కలగడంలేదు. అతనికి తెలుసు, ప్రజలు తనను దొంగ అని పిలుస్తారని. తనంటే అసహ్యంగా మాట్లాడతారు. తనను ఒక నీచుడుగా, ద్రోహిగా చూస్తారు.

ఈ భావన అతనిలో మొండితనాన్ని తెచ్చింది. పద్మనాభం ఎండిపోయిన పెదవులను నాలికతో తడుపుకున్నాడు. 'ఇంకా ఊహిస్తున్నాడు, పోలీసులు తనను పట్టుకోలేకపోవచ్చు. పోలీసులను తాను దాటాలిం తప్పించుకు తిరగవచ్చు. తాను ఎక్కడ ఉన్నదీ ఎవరికీ అంతు చిక్కని ప్రదేశాలకు తాను పోవాలి. ఎక్కడో దూర ప్రాంతాల్లో తను మర్యాదస్తుడుగా, పెద్ద మనిషిగా జీవితం గడపాలి. అవును, డబ్బు ఉన్నవాడికి మర్యాద జరుగకపోవడ మేమిటి!

కానీ, తాను ఒక్కడే ఉండాలి. తన కూతురిని తీసుకువెళ్ళడానికి వీలుపడదు. 'ఆ పిల్లను వాళ్ళ అత్తయ్య ఇంటిదగ్గర వదిలేసి వెళ్ళాలి. పిల్లలు లేని ఆ భార్యాభర్తలు ఈ పిల్లను తమ ఇంట్లో ఉంచుకునేటందుకు చాలా సంతోషపడతారు' అనుకున్నాడు పద్మనాభం.

పద్మనాభం ఒక నిట్టూర్పు విడిచాడు. పిల్లను తన చెల్లెలి ఇంట్లో దిగబెడితే తనకు జీవితంలో ఎక్కడలేని స్వేచ్ఛ వస్తుంది. ఆ ఆనందాన్ని, స్వేచ్ఛను తలుచుకోగానే అతనికి ఒళ్ళు పులకరించింది. ఒకసారి చుట్టూ కలయజూసేసరికి ఎవరో ఒక పోలీసు తనవైపు తీక్ష్ణంగా చూసినట్టు కనపడింది. ఆ పోలీసు మీసాలు దువ్వుకొని వెళ్ళిపోయాడు. పద్మనాభం పేవ్‌మెంటుమీద నిలబడి, పక్కనుంచే వెళ్ళిపోతున్న కార్ల ప్రవాహాన్ని పరిశీలిస్తున్నాడు.

దొంగ!

ఈ మాట అతని చెవుల్లో ప్రతిధ్వనించింది. ఆ మాట మరిచిపోదామని ప్రయత్నిస్తున్నాడు. కానీ అది అంతరాంతరాలలో పాతుకుపోయింది. ఇంతకూ తాను దొంగ. బాంకును దొంగిలించాడు. తనపై ఉంచిన నమ్మకాన్ని కూలదోశాడు. త్వరలోనే తనను పట్టుకుంటారు. అవమానిస్తారు. జైలుకు పంపిస్తారు. ఏదో నేరం చేశాననే బాధ ఒక్క క్షణం అతన్ని ఆవహించింది. మళ్ళీ త్వరలోనే ఆ అభిప్రాయాన్ని, బాధను విదిలించేశాడు. లేని ధైర్యాన్ని తెచ్చుకున్నాడు. మొండికెత్తాడు. తన భార్య బతికి ఉంటే ఆమె తనను గురించి ఏమనుకునేదో? అనే ఆలోచన కలిగింది. తప్పకుండా ఆమె తనను అసహ్యించుకొని ఉండేది. ఆమె జీవితాంతం తనను దూరంగా ఉంచేది. 'నేను మరీ మెత్తగా ఉండకూడదు' అనుకొని ఆ ఆలోచనను పూర్తిగా మనసులో నుంచి వెళ్ళగొట్టాడు. 'నేను ఇటువంటి అభిప్రాయాలు నాలో కలగనివ్వకూడదు. భాగ్యవంతులు ఇంకా భాగ్యవంతులవుతున్నారంటే, వారు ఇటువంటి సున్నితమైన ఆలోచనలకు తావు ఇవ్వకపోవడమే కారణం' అనుకున్నాడు.

రహదారి సిగ్నలు ఇచ్చే లైట్ల రంగులు మారుతున్నాయి. ఎరుపురంగు వచ్చింది. కారులన్నీ ఒక్కసారి ఆగిపోయాయి. పద్మనాభం రోడ్డు దాటడానికి ప్రయత్నం చేశాడు. ఇంతలో ఒక బలమైన చెయ్యి అతని భుజంమీద వాలింది. అతని ఒంట్లో రక్తమంతా గడ్డ కట్టుకున్నట్టు

**ఊరంకి వెంకటరావు**

అయిపోయింది. అతని ఒళ్ళంతా జలదరించిపోయింది. తలతిప్పి చూస్తే అతని స్నేహితుడు విశ్వనాథం కనిపించాడు.

"నువ్వు నిజంగా జడుసుకున్నావు" అన్నాడు విశ్వనాథం. పద్మనాభం నీరసంగా నవ్వి ఊరుకున్నాడు.

"చాలా కాలమైంది, మనం కలుసుకుని. కానా?"

"చాలా కాలమైంది" పద్మనాభం అన్నాడు.

పద్మనాభం తన స్నేహితుడివైపు కోరగా, ఈర్ష్యగా చూశాడు. 'బాగా తింటూ, ఏ చీకూ చింతా లేనివాడు హాయిగా, ఉత్సాహంగా ఉంటాడు' వారిద్దరూ రోడ్డు దాటారు.

"ఆఫీసునుంచి వస్తున్నావా?"

"అవును. వర్షంవల్ల ఈవాళ కొంచెం ఆలస్యమైంది" అన్నాడు పద్మనాభం వణికే గొంతుతో. ఇప్పటికి అతనిలో కొద్దిగా స్థిమితం ఏర్పడింది.

"ఈవాళ వాతావరణం బాగాలేదు" అని విశ్వనాథం ఊరుకున్నాడు.

దగ్గరలో జరిగిన ఒక గొడవవల్ల మళ్ళీ పద్మనాభం మనస్సు వికలమైంది. అయినా ఆపద్బాంధవుడిలాగ చోటు చేసుకుంటూ, "ఏమైంది" అంటూ ఆ పక్కనే ఉన్న గుంపులో దూరాడు.

"ఎవడో దొంగ!"

"కొట్లోనుంచి పట్టుకుపోతున్నాడు."

"పోలీసులకు అప్పగించండి."

అనేక కంఠాలు. విశ్వనాథం ఒక కుర్రవాణ్ణి పట్టుకున్నాడు. వాడు తన చుట్టూ బెదురు చూపులు చూస్తున్నాడు. వాడి ముఖం నల్లగా కమిలినట్లు ఉంది. చిందరవందరగా ఉన్న జుట్టు ముఖంమీద పడుతున్నది. పెదవుల మీదనుంచి రక్తం కారుతున్నది. విశ్వనాథం చేతిలో ఆ చిన్న ప్రాణి గిల గిల కొట్టుకుంటున్నది. అతని హృదయం ద్రవించింది.

పద్మనాభం ముందుకు వచ్చాడు. ఆ దిక్కులేని కుర్రవాణ్ణి ఒకసారి పరీక్షగా చూసి, ఒక్క లెంపకాయ కొట్టాడు. ఆ కుర్రవాడు ఆ దెబ్బకు తూలిపోయాడు. గుంపులోని జనమంతా గుసగుసల ద్వారా తమ ఆమోదాన్ని తెలిపారు. విశ్వనాథం కుర్రవాణ్ణి వదిలిపెట్టాడు.

"ఛీ, వెధవా" అన్నాడు పద్మనాభం.

కుర్రవాడు రెండడుగులు మెల్లగా వేసి, పక్క సందులోకి పరిగెత్తాడు. జనం కాస్సేపు గుసగుసలాడి, అటూ ఇటూ తచ్చాడి ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

"వాడికి తగిన బుద్ధి చెప్పాము" అన్నాడు పద్మనాభం కొంత బిడియ పడుతూ.

విశ్వనాథం ఏమీ అనలేదు. తన స్నేహితుడి ప్రవర్తనకు ఆశ్చర్యపోయాడు. తర్వాత వారిద్దరూ దగ్గరలో ఉన్న కాఫీ హోటలుకు వెళ్ళారు.

"ఏకేం కావాలి? దోసె, కాఫీ. అంతేనా?"

[తరువాయి 63 వ పేజీలో]

# దొంగ

(౬8 ఏ పేజీ తరువాయి)

అన్నాడు విశ్వనాథం. "అవును గానీ, అదేమిటి, ఆ సంచీ పట్టుకునే ఉన్నావు, దాని నిండా ఏదో డబ్బు ఉన్నట్టు? ఆ పక్క కుర్చీలో పెట్టి హాయిగా కూర్చోరాదూ?" అన్నాడు విశ్వనాథం.

పద్మనాభం తెల్లబోయాడు. భుజాన ఉన్న సంచీ తీసి ఒళ్ళో పెట్టుకున్నాడు.

"నీ కేం కావాలి?" అని మళ్ళీ అడిగాడు విశ్వనాథం.

"అబ్బే ఏమీ వద్దు. కాఫీ ఒక్కటి చాలు" అన్నాడు పద్మనాభం.

కాఫీ తాగేలోగా వారిద్దరూ ఏమీ మాట్లాడ లేదు. విశ్వనాథం మందంగా ఉన్న పద్మనాభంకేసి చూశాడు. ఆ కుర్రవాణ్ణి కొట్టినందుకు పద్మనాభం బాధ పడుతున్నా డనుకున్నాడు విశ్వనాథం. పద్మనాభం బాధకు విశ్వనాథం జాలి పడ్డాడు.

"ఆ కుర్రాడు నిజంగా దొంగే" అన్నాడు విశ్వనాథం.

"అవును. దొరికాడు కాబట్టి దొంగే" అన్నాడు పద్మనాభం.

"దొంగలను వదిలిపెట్టకూడదు. అవునా?"

"కాదు. మనలో చాలామంది దొంగలున్నారు. అయితే వాకచక్యం ఉన్న దొంగలు దొరకరు. ఆ దొంగల దగ్గర డబ్బు బాగా ఉంటుంది కనక, వారు మర్యాదస్తులుగా చలామణి అవుతుంటారు" అన్నాడు పద్మనాభం.

"కానీ ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళకు బుద్ధి వస్తుంది. న్యాయానికి విరుద్ధంగా వెళ్ళడం తప్పని తెలిసివస్తుంది. వాళ్ళ అంతరాత్మ ఘోషిస్తూనే ఉంటుంది."

"అంతరాత్మ అనేది బలహీనులకే వర్తిస్తుంది. ఇక న్యాయం అన్నావా, అది పిరికి వాళ్ళకి. మనకి భయం గనకనే మనం దొంగతనం చెయ్యము. మనకి అవకాశాలూ ఉండవు" అన్నాడు పద్మనాభం.

"అయితే ఆ కుర్రవాణ్ణి ఎందుకు కొట్టావు" అన్నాడు విశ్వనాథం ఆశ్చర్యపోతూ.

"వాడి చేతకాని తనానికి కొట్టాను" అన్నాడు పద్మనాభం.

ఇంటివైపు వెళ్ళుతూ విశ్వనాథంతో తను అన్న మాటలన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూ ఆలోచిస్తూ నడుస్తున్నాడు పద్మనాభం. 'చేతకాని తనానికి శిక్షించవలసిందే. తాను మాత్రం చేతకానివాడు కాకూడదు.' ఇలా ఆలోచిస్తూ నడుస్తూ ఉంటే ఒక కారు అకస్మాత్తుగా పక్కనుంచి పోతూ బురదనీళ్ళు తూలగొట్టింది. పద్మనాభం వెనకభాగ మంతా బురదనీటితో తడిసింది. తనకూ ఒక కారు ఉంటే బాగుండు ననిపించింది. చాలాకాలంనుంచి కారుకోసం కలలు కంటున్నాడు. కోరి, ఊహించి, కలలు గని, నిరాశ చెందిన చాలామందిలాగే తాను చాలా కాలం వేచిఉన్నాడు.

'ఇక నేను ఈ పాడు బతుకు బతకలేను. నా కలలు నిజం చేసుకోవాలి. నా జీవితమంతా ఇతరుల డబ్బు లెక్క పెడుతూ పాడు చేసుకోలేను, ఆ ఇచ్చే కాసిని జీతం రాళ్ళకోసమూ' అనుకున్నాడు పద్మనాభం. రోజూ లక్షలకొద్దీ రూపాయలు అతని చేతిమీదనుంచి నడిచేవి. కాని అందులో ఒక వందైనా తనది అనుకొనేటందుకు వీలులేదు.

'ఇకముందు కౌంటరు వెనక కూర్చుని కాలమంతా వృథా చేయడానికి వీలులేదు. నా కోరికలూ, ఆశలూ నాకు ఉన్నాయి. అందరిలాగే నేనూ అనుభవించాలి' అనుకొన్నాడు. అనుకొని తోలు సంచీని గటిగా అదుముకున్నాడు. ఇలా ఆలోచిస్తూ అతను ఇల్లు చేరుకున్నాడు. పని మనిషి వచ్చి తలుపు తీసింది.

"పాప ఎక్కడ ఉంది?"

"మీ గదిలో ఆడుకుంటూ ఉంది, బాబూ" అన్నది.

విరిగిపోయిన కుర్చీమీద పెట్టిన గుడ్డిదీపం వెలుతురులో అతని పక్కమీద కూర్చుని బొమ్మలతో పాప ఆడుకుంటూంది. పద్మనాభం అడుగుల చప్పుడు విని తలెత్తి చూసింది.

"నాన్నా" అంటూ ఒక్క అంగలో దూకి వచ్చి కౌగలించుకొంది.

"నాని ఏడమ్మా?" అని అడిగాడు పద్మనాభం. నాని పక్క వాటాలో అద్దెకు ఉంటున్న వారి అబ్బాయి.

"వాడు మంచి వాడుకాదు. వాడితో ఆడను."

"ఏమి? ఎందువల్ల?"

"వాడు నా బొమ్మ ఎత్తుకుపోయాడు. దొంగతో నే నాడను" అంది పాప.

పద్మనాభం సంచీ నేలమీద పెట్టాడు. అతని ముఖం నల్లబడిపోయింది. మసిబారిన దీపంలాగే అతని ముఖం కాంతివిహీనమయింది. కూతురు "దొంగ" అన్న మాటతో అతని నాడీ మండలంలో ఏదో పాకినట్టయింది. లేని ధైర్యం తెచ్చుకొని, "పాపా, రేపు నువ్వు మీ అత్తయ్య దగ్గరికి వెళ్ళుదువు గాని, ఏమమ్మా?" అన్నాడు.

"వెళ్ళుదాము, నాన్నా. అత్తయ్యకి నేనంటే ఎంతో ఇష్టం."

"మనం చెప్పకుండా అకస్మాత్తుగా వెళ్ళుదాము. ఏం?"

"అలాగే కాని, ఈ బొమ్మలన్నీ తీసుకుపోదాం, నాన్నా. ఇక్కడ వదిలేస్తే ఆ నానిగాడు ఎత్తుకుపోతాడు."

పద్మనాభం ఏమీ మాట్లాడలేదు. అతను ఆలోచనలో పడ్డాడు. అతను సంచీకేసి చూశాడు. కొంతసేపు పోయాక అన్నాడు: "అమ్మా, మీ నాన్న దొంగయితే అతనితో నువ్వు ఆడతావా?"

ఈ ప్రశ్న పాపకు మొదట అర్థం కాలేదు. తర్వాత కొంచెం బాధ పడినట్టుగా ముఖం పెట్టింది. తండ్రికేసి కళ్ళు పెద్దవిచేసి చూసింది. ఆ కళ్ళలో ఏదో తీవ్రత, నమ్మకం గోచరించి, ముఖం పక్కకు తిప్పుకున్నాడు పద్మనాభం.

"కాదు, నాన్న ఎప్పుడూ దొంగతనం చెయ్యడు" అన్నది పాప—ఎంతో నమ్మకం, విశ్వాసం స్ఫురించేటట్టుగా.

పద్మనాభం గుండెలో కలుక్కుమన్నది. అతనిలో ఉన్న పట్టుదల సడలిపోయింది. అతను చాలా నీరసించిపోయాడు. బలహీనమైపోయాడు. అతను ధైర్యాన్ని కూడగట్టుకొని బలం తెచ్చుకొని, తన పథకం అమలులో పెట్టడానికి ప్రయత్నం చేశాడు.

కానీ, ఆ రాత్రి నిద్రపోయే సమయంలో జ్యోతుల్లాంటి రెండు కళ్ళు తనను వెతుకుతూ, "మా నాన్న ఎప్పుడూ దొంగతనం చెయ్యడు" అన్నట్టు అతనికి పదే పదే గుర్తు రావడం మొదలపెట్టింది. ఈ మాటలు అతన్ని చాలా బాధించాయి. 'ఏమి నమ్మకం! ఏమి విశ్వాసం!' అనుకున్నాడు. కానీ, నిజానికి తాను దొంగ. అందరికీ తెలియడానికి ఇక ఆట్టే వ్యవధి లేదు. అందరూ తనను చూస్తున్నారు. నానిగాడు "పాపా, ఇదిగో, మీ నాన్న దొంగ. నువ్వు దొంగ కూతురివి" అంటున్నాడు. పాప బలహీనంగా, నిరర్థకంగా "కాదు, కాదు" అంటున్నది. జనం గుంపులు గుంపులుగా కూడుతున్నారు. తననూ, తన పాపనూ తన మర్యాదనూ అల్లరిపాలు చేస్తున్నారు.

పద్మనాభం తటాలున నిద్రలోనుంచి లేచాడు. తన కూతురు తల తడిమాడు. ఆ పిల్ల కదిలి తండ్రిని కౌగలించుకుంది. పద్మనాభం పాపను జోకొట్టి, "అవునమ్మా మీ నాన్న దొంగతనం చెయ్యడు" అన్నాడు.

పైని మబ్బులోనుంచి రెండు నక్షత్రాలు మసకగా కనిపిస్తున్నాయి. చల్లగాలి లోపలికి ప్రవేశించింది. 'రేపు ఈ డబ్బు యథాప్రకారం దాని స్థానంలో పెట్టేస్తాను. అదేమంత కష్టం కాదు' అనుకొన్నాడు పద్మనాభం. ★

## గృహవైద్యం

డాక్టర్ శ్రీహరి చిరునామా తెలియపరచవలసినదని కోరుతూ పలువురు వ్రాస్తున్నారు ఆయన చిరునామా ఇది:

డాక్టర్ శ్రీహరి
C|o
ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మద్రాసు—2